క్లుప్తంగా

వివాహానికి సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కుటుంబ సమేతంగా సోమవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వచ్చే నెల ఆరో తేదీన ఆయన ద్వితీయ కుమారుడి వివాహం హైదరాబాద్‌లో, 14న రాజమహేంద్రవరంలో జరిగే రిసెప్షన్‌కు హాజరుకావాల్సిందిగా కోరి సీఎంకు శుభలేఖ అందించారు. వేణుగోపాలరావు భార్య అంజలి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ వైస్ చైర్మన్ నిఖిల్‌కృష్ణ, దివ్య సీఎంను కలిశారు.

అవయవ దానంతో ప్రాణరక్షణ

కాకినాడ రూరల్: ప్రమాదం కారణంగా కోమాలోకి వెళ్లిన వ్యక్తి ఇక బతకడం అసాధ్యమని నిర్ధారిస్తే ఆ వ్యక్తి అవయవాలు దానం ద్వారా మరి కొందరికి ప్రాణ రక్షణ కల్పించవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన అవయవ దానంపై అవగాహన కల్పించారు. అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లో జరిగే స్పందనలో ఇటీవల దరఖాస్తులు చేసుకున్న ఏడుగురు అభ్యర్థులు వికాస ద్వారా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి డ్రీమ్ వే సొల్యూషన్స్, ఫ్లూయిన్‌టు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను స్పందన హాల్‌లో వారు మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ డ్రీమ్ వే సొల్యూషన్స్ కంపెనీలో జి.రమణి రూ. 20 వేల వేతనం, వి.విజయ్‌కు రూ.10 వేల వేతనంతో డిజైనర్‌గా ఎంపికయ్యారు. ఎం.సాయికుమార్ , జి మణిదీప్ డెవలపర్ ఉద్యోగానికి రూ.10 వేల వేతనంతో ఎంపికయ్యారు. ఎ.అనూష, బి.ఆకాశ్, బి.శివకృష్ణ, ఫ్లూయిన్‌టు కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.10 వేల స్టయిఫండ్ అందిస్తారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్. ఇలక్కియ, వికాస పీడీ కె.లచ్చారావు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగు నీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: విక్టోరియా వాటర్ వర్క్స్ లోని పైప్‌లైన్లకు మీటర్లు అమర్చనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం, బుధవారం ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి సోమవారం తెలిపారు. 14వ డివిజన్ నుంచి 50 డివిజన్ పరిధిలో ఉన్న మొత్తం జగన్నాథపురం ప్రాంతంతో పాటు, మెయిన్ రోడ్, సినిమా రోడ్, వార్ఫ్ రోడ్డు, బుడంపేట, జీజీహెచ్, పాత బస్టాండ్, రామారావుపేట, గాంధీ నగర్, మల్లయ్య అగ్రహారం, ప్రతాప్ నగర్, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు నీటిని ముందుగా నిలువ చేసుకుని పొదుపుగా వాడుకోవాలని ఎస్ఈ సత్యకుమారి సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని అందిస్తామన్నారు. ఇందుకోసం మొబైల్ నెంబర్లు 96767 70461, 97484 71415, 6301 387834లను సంప్రదించాల్సిందిగా కోరారు.

వరాహావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారామ స్వామి వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గృహప్రవేశాలకు సమాయత్తం చేయండి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జగనన్నకాలనీల్లో వచ్చే ఫిబ్రవరి నాటికి 15 వేల మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ కృత్తికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాల్లో గృహ నిర్మాణ, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గృహాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులను సమన్వయం చేసుకోవాలని, మండల స్థాయిలో ఏఈలు సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గృహ నిర్మాణ సామగ్రి కొరత లేకుండా చూడాలని సూచించారు. హౌసింగ్ సీఈ జీవీ ప్రసాద్, పీడీ వై.ప్రసాద్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

- శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు
- దర్శనాల కోసం పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలో నిలబడ్డ భక్తులు



సాంబమూర్తినగర్ విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కరప శివాలయంలో రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: కార్తికమాసం రెండో సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి కావడంతో ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని ఆలయాల్లో భక్తులు శివపంచాక్షరితో ఆలయాలను ప్రతిధ్వనింపజేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము మూడు గంటల నుంచి ఆలయంలో అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి భక్తుల దర్శనం కోసం క్యూలు కట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భారీ అన్నదానం చేశారు. సుమారు రెండు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకటసత్యనారాయణ తెలిపారు. స్థానిక రామారావుపేటలోని శివాలయంలో భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. ఉచిత దర్శనంతోపాటు, రూ.20 దర్శనాలకు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం కోసం సుమారు గంట సేపు క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక సాంబమూర్తినగర్‌లోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. స్థానిక జగన్నాథపురం శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. కార్తికపౌర్ణమి సందర్భంగా అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు.

భస్మ గణపతికి బిల్వార్చన

స్థానిక భోగి గణపతి పీఠంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సైకత శివలింగానికి బిల్వార్చన చేశారు. శివ సహస్రనామార్చన పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

కరప: మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామున 3 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభ మయ్యాయి. ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు, లక్ష్మీనారాయణలు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు చేశారు. విష్ణాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పూజలు చేశారు. ఆలయంలో మహిళలు, దంపతులు ఉసిరి, దీపం దానమిచ్చి, అర్చకులతో ఆశీర్వాదం తీసుకున్నారు. కరపలో ఈఓ వడ్డాది సత్తిబాబు, చినమామిడాడలోని పంచముఖేశ్వర ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి, ఆయా గ్రామాల్లోని ఆలయకమిటీ వారు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది. ఆయా గ్రామాల్లోని అయ్యప్పస్వాములు, పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించి, స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దేదీప్యమానంగా కార్తిక దీపోత్సవం



కరపలో కార్తికదీపాల సంబరంలో కొలువుదీరిన శివపార్వతులు

కరప: మండల కేంద్రమైన కరపలో సోమవారం రాత్రి 19వ కార్తిక కోటి దీపోత్సవాన్ని భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. యేట కార్తిక మాసంలో 2వ సోమవారం దీపాల సంబరం జరపడం ఆనవాయితీగా వస్తోంది. కార్తిక దీపాల ఉత్సవ కమిటీ, భక్తులు ఇచ్చిన విరాళాలతో సంబరాన్ని నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ముందు శివ పార్వతులను నిలిపి పూజలు చేసి, వివిధ భజన బృందాలతో ఏకాహం నిర్వహించి, సంబరం రోజున నాలుగు ఇనపరాడ్లతో అరపలను తయారుచేసి, వాటిలో ప్రమిదలు పెట్టి, నూనెపోసి కార్తికదీపాలు వెలిగిస్తారు. ఈసందర్భంగా ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్, వినాయక, శివపార్వతుల వేషధారణ, రెడ్డి చంద్రరావు బృందంతో కోలసంబరం, మహిళా బృందం కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించి, మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దీపాల సంబరంలో భాగంగా అరప తయారు చేసి ప్రమిదల్లో దీపాలు వెలిగించిన భక్తులు

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- కలెక్టర్ కృతికా శుక్లా
- 'ఆడుదాం ఆంధ్ర' క్రికెట్ కిట్ల పంపిణీ



ఆడుదాం ఆంధ్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ



కరపలో ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు సంబంధించి క్రీడా కిట్లను సోమవారం స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ కృతికా శుక్లా నిర్వాహకులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 ఏళ్లు పైబడిన అన్ని వయసుల వారిని క్రీడల్లో భాగస్వాములను చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. డిసెంబర్ 15 నుండి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలకు నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి రూ.35 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి 5 లక్షలు, రెండో బహుమతి 3 లక్షలు, మూడో బహుమతి రూ.2 లక్షలు అందజేస్తామన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.50 వేలు అందజేస్తారన్నారు.

కరపలో...

కరప: గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయాల అసిస్టెంట్లకు ఆడుదాం ఆంధ్ర ఆటలకు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకూ నాణ్యమైన పరిష్కారం

- కమిషనర్ నాగ నరసింహారావు



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం.. కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫోన్ ద్వారా, నేరుగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, ఉద్యాన విభాగాలకు సంబంధించి 18 దరఖాస్తులు అందాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ నాగ నరసింహారావు అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్యలను ఎప్పటికప్పుడు నిర్దేశించిన వ్యవధిలో పరిష్కరించి ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు.

టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలతో పాటు ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని కమిషనర్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు 1800 4255 990కు కాల్ చేసి సమస్యలను వివరించవచ్చునన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు వచ్చే ఫిర్యాదులను కూడా పూర్తి ప్రాధాన్యం ఉంటుందని, ఈ నెంబర్‌కు కూడా ప్రజలు ఫోన్ చేయవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఈఈలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కె.సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు కార్యక్రమానికి హాజరయ్యారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- వెంకట్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్



సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక వెంకట్‌నగర్ 4వ డివిజన్‌లో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకట లక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో కూడా పారదర్శకతను అమలు చేస్తూ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, పలక సూర్యకుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

లింగ వివక్షపై పోరాడాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): లింగ ఆధారిత వివక్షత వ్యతిరేకంగా ప్రచారాన్ని విస్తృతం చేయాలని కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకూ నిర్వహించే ప్రచారానికి సంబంధించి పోస్టర్ వివిధ శాఖల అధికారులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృత్తికా శుక్లా మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో గ్రామ స్థాయిలో ప్రచారం చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, డీఆర్ఓ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, డీఈవో నాగమణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 55 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనలో 55 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి సమస్య తక్షణ పరిష్కారానికి ఆదేశాలిచ్చారు.

చిచ్చురేపిన ప్రేమ వ్యవహారం

కాకినాడ క్రైం: ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాల మధ్య చిచ్చు రేపింది. రెండు రోజుల క్రితం కాకినాడ ముత్తానగర్‌లో నివసిస్తూ వెళ్లిపోయిన ప్రేమ జంటకు సంబంధించి యువతి కుటుంబీకులు రచ్చ చేసి యువకుడి బంధువుల ఇళ్లపై విరుచుకుపడ్డారు. యువకుడి కుటుంబీకులు ఇంద్రపాలెంలో ఉండగా వారి బంధువుల ఇళ్లలో యువకుడి ఆచూకీ దొరకవచ్చన్న అభిప్రాయంతో గోళీలపేటలో ఉండే ఓ ఇంటి తాళాలు బద్దలుకొట్టి లోపలికి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. వీరి నిర్వాకంపై బాధితుల ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఓలేటి ధర్మారావు, ఓలేటి శ్రీను, ఓలేటి కామేష్, ఓలేటి కిశోర్, పాలెపు సతీష్‌లపై కేసు నమోదు కాగా వారు పరారీలో ఉన్నారు.

దేశ ఔన్నత్యానికి ప్రతీక రాజ్యాంగం



వేదికపై ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ

కాకినాడ రూరల్: భారత దేశ ఔన్నత్యానికి ప్రతీకగా మన రాజ్యాంగం నిలుస్తుందని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంత శ్రీ తెలిపారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటరులో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–1 అధికారి డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ పోచయ్య, డాక్టరు అజయ్ రతన్, డాక్టర్ హారిక, నానిబాబు, రామరాజు, హరిబాబు, అప్పారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిజ నిర్ధారణకు అభ్యర్థుల సర్టిఫికెట్లు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఈ ఏడాది జూన్‌లో విడుదల చేసిన నర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. అనేక వివాదాల మధ్య సందిగ్ధంలో పడిన నియామక పత్రాల జారీ సోమవారం నాటికి పూర్తయింది. అయితే జీఎన్ఎం నర్సింగ్ విభాగంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వాస్తవికతపై తుది వరకు వివాదం కొనసాగింది. మెరిట్ లిస్టులో పేర్లు ఉన్న తొలి 10 మందితో పాటు జాబితాలో మరికొందరి సర్టిఫికేట్లు నకిలీవని పెద్ద సంఖ్యలో అభ్యర్థులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు విన్నవించారు. తక్షణమే నియామక పత్రాల జారీ ప్రక్రియ నిలిపివేయాలని కోరారు. ఆ వెంటనే ఈ విషయంపై కలెక్టర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారితో చర్చించారు. అప్పటికే మంజూరు చేసిన నేపథ్యంలో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థుల పత్రాల వాస్తవికతను నిర్ధారించేందుకు నర్సింగ్ కౌన్సిల్‌కు పంపాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వారం రోజుల వ్యవధిలో నియామక పత్రాలు అందుకున్న ప్రతి అభ్యర్థి సర్టిఫికేట్లను రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌కు పంపనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు





సమావేశానికి హాజరైన బీఎల్‌వోలు, (అంతర చిత్రం) సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నాగ నరసింహారావు

- ఈ ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర కీలకం
- ఈఆర్ఓ నాగ నరసింహారావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిపై ఉందని నియోజకవర్గ ఈఆర్ఓ, కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీఎల్ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వారిని కూడా ప్రోత్సహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నదే ఎన్నికల కమిషన్ నిర్ణయమన్నారు. ఆచూకీ లభించని (నాన్ ట్రేస్డ్) ఓట్లకు సంబంధించి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన నోటీసులు, వాటి ప్రగతిపై చర్చించారు. ఓకే డోర్ నెంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉంటే పరిష్కరించే విధానంపై సూచనలు ఇచ్చారు. ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులు, తొలగింపునకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురితమవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓ పాత్ర అత్యంత కీలకమన్నారు. సమావేశంలో ఈఆర్వోలు కోన శ్రీనివాస్, సీతాపతి, మురళీకృష్ణ, నాగశాస్త్రులు, జాన్ బాబు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి రహిత బోధన అవసరం

- ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్
- వైద్యుల వర్క్‌షాప్ ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వైద్యుల శిక్షణకు సంబంధించిన వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే ఈ వర్క్‌షాప్‌లో ఒత్తిడి రహిత విషయావగాహన ప్రాధాన్యంతో అనుసంధానించబడిన బోధనా విధానాలపై శిక్షణ ఇచ్చారు. తర్వాతి తరం వైద్య రత్నాల్ని సంసిద్ధం చేసే ఈ విధానాన్ని కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పేర్కొంటున్నారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి బోధకులకు దిశానిర్దేశం చేశారు. బోధనా విధానాల అనుసరణ, మార్పులకు అనుగుణంగా నైపుణ్య వృద్ధి, ఒత్తిడి లేని విధానాల అనుసరణ, వాటిని పెంపొందించుకోవలసిన ప్రాధాన్యం, అవలంబించాల్సిన విధానాలను వివరించారు. వైద్య విద్యా బోధన అనుబంధ కార్యకలాపాల నిర్వహణకు ఈ సదస్సులో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ విభాగాలకు చెందిన మొత్తం 30 మంది వైద్య బోధకులు పాల్గొన్నారు. వారిలో ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి సహా ఫిజియాలజీ, పాథాలజీ, జనరల్ సర్జరీ, న్యూరోసర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్, అనాటమీ నిపుణులు ఉన్నారు.